



ఆరోజు ఆదివారం కావడంతో పార్క్ అంతా జనంతో కిక్కిరిసి ఉంది. ఒక ప్రక్క ప్రేమికులు, ఇంకో ప్రక్క పెళ్లయిన జంటలు. మరో పక్క పెద్ద వాళ్ళు తమ వయసును మరచిపోయి పిల్లలతో ఆటలు, పాటలు, కేరింతలు. ఇంకా చాలామంది అక్కడ ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. మరోసారి నా కళ్ళు చుట్టూ వెతికాయి నేను ఎదురుచూస్తున్న వ్యక్తి గురించి. టైం ఆరవుతోంది. భాస్కర్ రాలేదు. అప్పటికే గంట నుంచి ఎదురు చూస్తున్నాను. అక్కడున్న వాతావరణం ప్రశాంతత చూస్తే నాలో ఏవో ఆలోచనలు ఒక్కసారిగా వెనక్కు వెళ్లాయి.

★ ★ ★

భాస్కర్ పేరు వింటేనే నా మనసులో ఏదో అలజడి. నాకు భాస్కర్ అంటే ఇష్టమని చెప్పేకంటే భాస్కర్‌కి నేనంటే ప్రాణమని చెప్పడం సరియైనది.

నేను పనిచేసే కన్సల్టెన్సీ ఆఫీసు పక్కన నాలు గడుగుల దూరంలో భానూ ఆఫీస్. ఆఫీస్ కాగానే ప్రతిరోజూ బస్టాప్ వరకూ నన్ను ఫాలో అయ్యేవాడు. చూస్తే నవ్వేవాడు. ఎదురుపడితే తప్పించుకునేవాడు. ఏదో మాట్లాడదామని ప్రయత్నించేవాడు.

ఒకరినొకరం చూసుకునేవాళ్లమే గానీ పట్టించుకోలేదు. అతని పద్ధతి చూస్తే ఏదో ఒకరోజు నాదగ్గరకు వచ్చి 'ఐ లవ్ యూ' అని చెబుతాడేమో అనుకున్నాను.

ఒకరోజు వర్షం కురుస్తూనే ఉంది. బస్సు రావడం ఆలస్యం అయింది. పైగా చీకటిగా కూడా ఉంది. నాతోపాటూ ఒకరిద్దరు తప్ప బస్టాప్‌లో ఎవరూ లేరు. ఈలోగా భాస్కర్ వచ్చాడు. తన బైక్ ఎక్కమని ఎంతో బలవంతం చేశాడు. వెళ్లాలని అనిపించింది. కానీ ఆడదాన్ని కదా కొంచెం బెట్టు చేశాను. అప్పుడున్న పరిస్థితిని బట్టి అతనితో వెళ్ల కతప్పలేదు.

అప్పుడే మొదలైంది మా పరిచయం.

ప్రతిరోజు మాదిరిగానే బస్ రాకకోసం ఎదురు చూస్తున్న నా వద్దకు వచ్చాడు భాస్కర్. నాతో మాట్లాడాలన్నాడు. దగ్గరలో ఉన్న కాఫీక్లబ్‌కి తీసుకెళ్లాడు.

ఇద్దరం లోపలికి వెళ్లి మూలగా ఉన్న టేబుల్ దగ్గర కూర్చున్నాం. భాస్కర్ కాఫీకి ఆర్డరిచ్చాడు. ఏమాత్రం సంకోచం లేకుండా నేరుగా విషయానికి వచ్చాడు.

"శ్రావణీ! నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్లికూడా చేసుకుంటాను'' అన్నాడు.

"పరిచయమైన కొద్దిరోజులకే ప్రేమ ఎలా పుడుతుంది? ఎందుకు పుడుతుందో కారణం చెప్పలేం. ఈ పరస్పర ఆకర్షణకు దారితీసే పరిస్థితులు ఏమిటో కూడా తెలియదు. తెలుసుకోలేదు. కానీ నిర్ణయం నాదగ్గరలేదు'' అని చెప్పాను.

అతన్ని ఎప్పుడు చూసినా అమాయకంగా, అందంగా ఉంటాడు. ఏదైనా ముక్కుసూటిగా మాట్లాడే మనస్తత్వం. అందరిలాంటివాడిలా నాకు అన్పించలేదు అతను. అతనంటే ఇష్టం ఉన్నా బయటకు వెల్లడిచేయలేని పరిస్థితి నాది.

కొన్నిరోజుల తర్వాత భాస్కర్ తల్లిదండ్రులు నాన్న దగ్గరకు వచ్చి నా విషయం మాట్లాడారు. ఉన్న ఒక్కగానొక్క కొడుక్కి గవర్నమెంట్ ఉద్యోగం వేయించి మంచి ధనవంతుల అమ్మాయికిచ్చి పెళ్ళి చేయాలనుకున్నామని, ఇప్పుడు ప్రేమ, పెళ్లి అంటూ మీ అమ్మాయి చుట్టూ తిరుగుతున్నాడంటూ నాన్న పెంపకం గురించి నాన్నను అవమానించేలా మాట్లాడారు.

జరిగిన విషయం తెలిసి భాస్కర్ నాన్నకు క్షమాపణ చెప్పి నాన్నకు ఎన్నో విధాలుగా నచ్చజెప్పాడు. వాళ్లని ఒప్పించి నన్ను ఎలాగైనా పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఇప్పటికి మూడేళ్ళు గడిచాయి. ఈ మూడేళ్లు నాన్న నాకు విధించిన శిక్ష నాతో మాట్లాడకపోవడం. నాన్న ఎప్పుడూ అనేవారు ఆడదానికి సంతోషం భర్త, పిల్లలు, సుఖమైన సంసారం అని. ఆఖరిసారిగా మాట్లాడదామని రమ్మని చెప్పాను భాస్కర్‌ని.

నాకళ్ళు ఒక్కసారిగా మెరిశాయి. దూరంగా భాస్కర్. కానీ ఆ మొహంలో ఏదో నిరుత్సాహం. తన తల్లిదండ్రులు ఏదో సంబంధం చూశారని, అది చేసుకోకపోతే తాము చచ్చిపోతామని బెదిరించారని చెప్పాడు. నీవు ఒప్పుకుంటే దూరంగా వెళ్లి పెళ్ళి చేసుకుంటానన్నాడు. అంటే భాస్కర్ వల్ల నేను నా తండ్రికి దూరం కావాలా. మూడేళ్ళు నాన్న పిలుపునకు దూరమయ్యాను. ఇన్నాళ్ళు కోల్పోయింది ఏమిటో నాకర్థమైంది. నా నిర్ణయం గురించి కనుక్కోవడానికి రేపు వస్తానన్నాడు.

ఆరోజు జరిగిన సంఘటన వల్ల రాత్రంతా నిద్ర పట్టలేదు. ఉదయాన్నే కాఫీ పెట్టి పేపర్ చదువుతున్న నాన్న దగ్గరగా వెళ్ళి కాఫీ ఇచ్చాను. ఆయన చేతిమీద నా కన్నీటి చుక్కలు పడ్డాయి. నా వైపు చూసి చెంపలమీదుగా కారుతున్న నా కన్నీటిని తుడిచి నన్ను ఓదారుస్తూ ప్రేమగా నా నుదుటి మీద ముద్దుపెట్టారు. "నాన్నా! మీ ప్రేమచాలు. ఎవరి ప్రేమ అక్కర్లేదు'' ఆయన కాళ్లమీద పడి నా తప్పు ఒప్పుకున్నాను.

నేను తీసుకున్న నిర్ణయం సరియైనదని నా మనసుకు అనిపించింది. అప్పుడే కొత్తగా రెక్కలొచ్చిన పక్షిలా ఆకాశంలోకి విహరిస్తున్నట్టుంది నా మనసు.

★